

దారం పట్టింది ... ఆధారమైంది

నగరి: ఈమె పేరు కన్నియమ్మ. నగరి మున్సిపాలిటీలోని కొత్తపేట గ్రామం. ఐదేళ్ల క్రితం వరకు ఈమె వంటింటికే పరిమితమైన గృహిణి. ఐదేళ్లకు ముందు ఈమె భర్త నేత కార్మికుడైన అన్నామలై అకస్మాత్తుగా మరణించారు. దీంతో ఇద్దరు బిడ్డల పోషణ బాధ్యత ఈమెపై పడింది. భర్త దూరమైన శోకాన్ని దిగమింగుకుని బిడ్డల భవిష్యత్తు కోసం అప్పటివరకు అలవాటు లేని నేతవృత్తిలోకి అడుగు పెట్టింది. నూలును డబ్బాలుగా చుట్టే డబ్బా యంత్రం నడపడం నేర్చుకుంది. దారాన్ని చేతబట్టి కుటుంబానికి ఆధారమైన ఆమె పెద్ద కుమారుడు హరిని బీకాం వరకు చదివించింది. ఇతను ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండవ కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. దృఢ సంకల్పం ఉంటే మహిళలు ఏ వృత్తిలోనైనా రాణించవచ్చని, కుటుంబాన్ని పోషించుకోవచ్చని నిరూపిస్తోంది.

డబ్బా యంత్రంలో నూలు చుడుతున్న కన్నియమ్మ





నిరంతర శ్రామిక



ముగ్గురు ఆడబిడ్డలతో నాగరాజ

ఐరాల: నేటి సమాజంలో తల్లిదండ్రులు ఒక్క బిడ్డను చదివించడానికే అష్టకష్టాలు పడుతున్న తరుణంలో.. భర్తను కోల్పోయి, పుట్టినిల్లు, మెట్టినిల్లు వాకి సహకారం లేకపోయినా తాను చదువుకోకపోయినా తన ముగ్గురు ఆడబిడ్డలను ఉన్నతంగా చదివిస్తోంది. ఐరాల మండలం గూబలవారిపల్లె దళితవాడకు చెందిన నాగరాజ. భర్త చంద్రమౌళి వ్యవసాయ కూలీ. వీరికి ముగ్గురు ఆడబిడ్డలు సంతానం. భర్త సంపాదనతోనే కుటుంబం గడిచిపోయేది. 13 ఏళ్ల క్రితం భర్త చంద్రమౌళి అనారోగ్యంతో మరణించాడు. వృద్ధులైన అత్తామామలతోపాటు ముగ్గురు ఆడబిడ్డలను ఎలా పోషించాలో తెలియక కుమిలిపోయింది. ఆ సమయంలో మూడో కుమార్తె రెండేళ్ల బిడ్డ. ఎలాగైనా సరే ఆడబిడ్డలను చదివించుకుని వారికి మంచి భవిష్యత్‌ను ఇవ్వాలని నిర్ణయించుకుంది. తాను వ్యవసాయ కూలీగా కొత్త జీవితం మొదలుపెట్టింది. ఆ పనుల్లేకపోవడంతో ఇప్పుడు భవన నిర్మాణ కూలీగా మారింది. ముగ్గురు ఆడబిడ్డలు డిగ్రీ, ఇంటర్, టెన్త్ చదువుతున్నారు. వారిని ఉన్నత స్థానంలో చూడాలని నాగరజా తపనపడుతోంది.

ఆమె.. అజేయం

రాజకీయం నుంచి రాకెట్లో దూసుకుపోయే వరకు ఎంచుకున్న రంగం ఏదైనా ఉత్తుంగ.. తరంగమై ప్రేరణ నింపే స్ఫూర్తి ప్రదాత మహిళ. అలాంటి అతివకు అడుగడుగునా అణిచివేత ఎదురవుతోంది. ఇంకా అత్యాచారాలు.. వర కట్న వేధింపులు.. లింగ వివక్ష.. ఆడ పిల్లల భ్రూణహత్యలు వెంటాడుతున్నాయి. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ధీశాలిగా ఎదగాలని ఆశిద్దా. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలో స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల విజయపథం వివరాలు. - కార్వేటినగరం



అతివలంతా ఎదిగితేనే సాధికారత



మాది పుత్తూరు సమీపంలోని ఉత్తరపు కండ్రిగ. ప్రాథమిక విద్య సొంత గ్రామంలో పూర్తి చేసుకున్నాను. హైస్కూల్ నుంచి పుత్తూరులో మేనమామ ప్రోత్సాహంతో ఎంబీఏ పూర్తి చేసుకుని రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించా. ప్రస్తుతం ఆర్‌ఎస్ డీటీగా కార్వేటినగరంలో విధులు నిర్వహిస్తున్నా. మహిళ విద్యలో రాణిస్తే పురుషులకు దీటుగా నిలుస్తారు. అతివలంతా గొప్పవారిని ఆదర్శంగా తీసుకుని ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యం.

–స్వరూపరాణి, ఆర్‌ఎస్ డీటీ, కార్వేటినగరం

సమాజానికి ఆదర్శం కావాలి



మహిళా ఉద్యోగులు బాధ్యతగా పని చేసి సమాజానికి ఆదర్శం కావాలి. ప్రస్తుతం మహిళలు కూడా పురుషులకు దీటుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తే సమానత్వం వస్తుంది. మహిళలకు మరిన్ని ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి రక్షణ కల్పించాల్సి ఉంది.

–డాక్టర్ పీవీ భువనేశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారి, కార్వేటినగరం

ఒకటి అనుకుంటే మరొకటి అయ్యింది



మాది నారాయణవనం గ్రామం. నా తండ్రి పంచాయతీరాజ్ . శాఖలో విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగ రంగంలో స్థిరపడాలనే ఆశయంతో డిగ్రీ చదువుతున్నప్పుడు తండ్రి మరణం కుంగదీసింది. ఆయన ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించి పురుషులతో సమానంగా నిలవాలి.

–నాగరత్నమ్మ, పంచాయతీ ఈఓ, కార్వేటినగరం

కర్ణాటక నుంచి వచ్చి ఆంధ్రాలో ఎంపీపీ



బెంగళూరు సిటీలో బ్యాంకు ఉద్యోగి కుటుంబంలో జన్మించా. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా కార్వేటినగరం అత్తవారి ఇంటిలో ఉన్నప్పుడు మహిళా కోటా కింద ప్రజాప్రతినిధినయ్యా. ప్రస్తుతం ఎంపీపీగా ఉంటున్నా. భారత రాజ్యాంగం పురుషులతోపాటు మహిళలకు అన్ని రంగాల్లో కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలి. మహిళలకు గుర్తింపు లభిస్తోంది.

–లత, ఎంపీపీ, కార్వేటినగరం

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



మా కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు లేరు అన్న నిరుత్సాహంతో ఉన్న తల్లిదండ్రుల కోరికను నెరవెర్చాలనే పట్టుదలతో ఎంటెక్ వరకు చదుకున్నా. ఉద్యోగ అవకాశం కోసం హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ వెళ్లిన మూడు నెలల్లో ప్రభుత్వం సచివాలయ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్షల్లో ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కోరికను నెరవేర్చా. పట్టుదల ఉంటే మహిళలు పురుషులతో సమానంగా ఏ రంగంలోనైనా నిలుస్తారని నిరూపించా.

–రోజా, డిజిటల్ అసిస్టెంట్, కార్వేటినగరం

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కార్వేటినగరం: నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండల కార్యాలయాల ఆవరణలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొని సమస్యలను పరిష్కరించిన నివేదిక తప్పక వెంట తీసుకు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులు కేటాయించిన సమయానికి ముందే సమావేశ భవనంలో ఉండాలని సూచించారు.

వైభవంగా రామక్కమ్మ ఉత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయపురం: మండలంలోని కోసలనగరం పంచాయతీ, మిట్టూరు గ్రామంలో శ్రీరామక్కమ్మ ఆశ్రయంలో 45వ ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆంధ్ర, తమిళనాడుకు చెందిన భక్తులు వేల సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ నిర్వాహకులు వాసుదేవస్వామి రాత్రి అమ్మవారి చిత్ర పటాన్ని ఊరేగించారు.

ఫారంపాండ్ పనులు వేగవంతం

కార్వేటినగరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫారంపాండ్ పనులను వేగవంతం చేయాలని నగరి క్లస్టర్ ఏపీడీ సునీల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేశవకుప్పం, సీడీ కండ్రిగ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫారంపాండ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుండి జూన్ వరకు అదనంగా మరో 10 పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఏపీఓ జాహ్నవి మాట్లాడుతూ ఫారంపాండుకల నిర్మిస్తున్న రైతులకు 10 కొబ్బరి చెట్లు, కూరగాయల కిట్లు అందిస్తామన్నారు.

బ్యాంకులో మహిళా దినోత్సవం



సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహిళలతో అధికారులు

కార్వేటినగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ మహిళలే దేశాభివృద్ధికి మూలమన్నారు. మహిళలు విద్యారంగంలో పురుషులకు మించి ప్రగతి సాధిస్తున్నారని అన్నారు. సంఘమిత్రలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారికి యూనిఫాం దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర రెడ్డి, ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పుత్తూరు: పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ దేవాశీర్వాదం ఆకాంక్షించారు. శుక్రవారం కళాశాల దినోత్సవం, వీడ్కోలు కార్యక్రమాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవాశీర్వాదం మాట్లాడుతూ పుత్తూరు పరిసర ప్రాంతాల విద్యార్థులకు పిళ్లారిపట్టు కళాశాల ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం మెప్మా, ఐసీడీఎస్ ప్రాజెక్టు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తెలియజేశారు.

బడికి బాల కార్మికుడు



చిన్నారిని బడిలో చేర్పుతున్న ఉపాధ్యాయులు

నగరి: మండలంలోని వేలావడి గ్రామానికి చెందిన జంషీర్ అనే బాల కార్మికుడిని ఉపాధ్యాయులు గుర్తించి శుక్రవారం పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉన్న జంషీర్ నగరి పట్టణంలోని ఒక చెప్పుల దుకాణంలో పని చేస్తూ బాలకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఉపాధ్యాయులు అతన్ని గుర్తించి మండలంలోని ఎం.కొత్తూరు పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. సీఆర్‌పీ మునస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ నిసార్ అహ్మద్, పాఠశాల ప్రథమ అసిస్టెంట్ హిమావతి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అమర్నాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెదురుకుప్పంలోని మండల పరిషత్ సమావేశం హాల్లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

లేగదూడల పెంపకంపై మెళకువలు



లేగ దూడల ప్రదర్శనలో అధికారులు

వెదురుకుప్పం: పాడి రైతులు లేగ దూడల పెంపకంపై మెళకువలు పాటించాలని పుత్తూరు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు గోవిందయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ తెట్టుగుండ్ల పల్లె గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ పథకం కింద పశుసంవర్ధక శాఖ, తిరుపతి పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి లేగ దూడలను ఎంపిక చేసుకుని వాటి పెంపకంలో యాజమాన్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. అనంతరం పెయ్యి దూడల పెంపకంలో యాజమాన్య పద్ధతులకు సంబంధించి వివిధ అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. చివరిగా పాడి రైతులకు మినరల్ మిక్చర్, గ్రోత్ టానిక్, నట్టల నివారణ మందులతోపాటు బహుమతులు అందజేశారు. తిరుపతి పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు బాల సుబ్రమణ్యం, మండల పశు వైద్యాధికారి రాజేష్, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

శ్మశానానికి అడ్డంగా గోతులు



శ్మశానానికి అడ్డంగా తవ్విన గోతులు

శ్రీరంగరాజపురం: శ్మశానానికి అడ్డంగా గోతులు తవ్విన సంఘటన మండలంలోని ఉడమాలకుర్తి పంచాయతీ పి.వి.పురం దళితవాడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గతంలో పి.వి.పురం దళితవాడకు శ్మశానం లేదు. అయితే దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని అప్పటి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక జీ.ఓ ద్వారా పి.వి.పురం గ్రామానికి వెంకటాపురం రెవెన్యూ లెక్కదాఖల సర్వే నంబర్ :257/7లో 0.87 సెంట్లు స్థలం కేటాయించారు. శ్మశానికి వెళ్లడానికి దారి సౌకర్యం లేకపోవడం అప్పటి కలెక్టర్ హరినారయణ్ పి.వి.గ్రామాన్ని సందర్శించి కాలువ పక్కన రోడ్డు సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం కూటమికి చెందిన కొంత మంది వ్యక్తులు శ్మశానికి వెళ్లేదారిని కబ్జా చేసి శ్మశానికి అడ్డంగా గోతులు తవ్వేశారు. అధికారులు స్పందించి శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళా శక్తి ప్రపంచానికే ఆదర్శం



చిత్రలేఖనంలో రాణించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ విజయులురెడ్డి, వైద్యాధికారులు

కార్వేటినగరం: మహిళా శక్తి ప్రపంచానికే ఆదర్శమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తి మాట్లాడుతూ మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన ఎం.జ్ఞానప్రసన్న, ఎస్.మానస, పూర్ణిమలకు బహుమతులను అందించారు. సీహెచ్‌సీ మహిళా వైద్యాధికారులు డాక్టర్ శృతి, డాక్టర్ శృతిభాగ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి, సీఎస్ లత, వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యంఆచారి పాల్గొన్నారు.

11వ తేదీ కూరగాయల సంత వేలం

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ప్రతి మంగళవారం జరిగే కూరగాయల సంత వేలం వేస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు సచివాలయ కార్యాలయంలో వేలం పాడుకోదలచిన వారు పాల్గొనాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

కార్వేటినగరం: పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ జరగకుండా చూడాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం కార్వేటినగరంలో ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సీఐ హనుమంతప్పతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు చూడాలని, స్క్వాడ్ అధికారుల తనిఖీల్లో విద్యార్థులు పట్టుబడితే ఆ పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్‌పై చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ స్వరూప, ఏఎస్ఐలు మునికృష్ణ, గోవిందస్వామి ఉన్నారు.

నేడు కుంభాభిషేకం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో శ్రీప్రసన్న వినాయక ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేడు సాయంత్రం 7 గంటలకు మహాగణపతి హోమం, అనుజ్ఞ, లక్ష్మీహోమం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 9వ తేదీ శనివారం దశమి తిథి ఆరుద్ర నక్షత్ర లగ్నంలో శ్రీదుర్గ నింద్రేశ్వర లింగ ప్రతిష్టాపన నిర్వహిస్తారు. 10వ తేదీ ఆదివారం యాగశాల పూజ, మహా కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చలో విజయవాడకు తరలిరండి

నగరి: అంగన్‌వాడీ సమస్యలపై నిర్వహించే చలో విజయవాడను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబునాయుడు శిబిరాల వద్దకు వచ్చి అధికారంలోకి వస్తే జీతాలు పెంచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో నూటికి 95 మంది కార్మికులు, ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారన్నారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు కావస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన లేదన్నారు. ఈ నెల 10వ తేదీన అంగన్‌వాడీ వర్కర్స్ రాష్ట్ర కార్మిక సంఘాలైన సీటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ యూనియన్ల ఆధ్వర్యంలో చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచుతామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కార్వేటినగరం: నేడు రెండో శనివారం కావడంతో మెయింటెనెన్స్ కారణంగా మండల వ్యాప్తంగా ఉన్న సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం ఉండడంతో కార్వేటినగరం ఫీడర్‌లో మాత్రం విద్యుత్ యథావిధిగా ఉంటుందని ఏఈ పేర్కొన్నారు.

స్త్రీలకు నిర్ణయాధికారం కల్పించాలి



సన్మాన గ్రహీతలతో డీఎస్పీ, సీఐ, ప్రిన్సిపల్

నగరి: కుటుంబంలో నిర్ణయాధికారం పురుషులతో సమానంగా స్త్రీలకు లభించాలని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మహిళా అధ్యాపకులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బాలికలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా స్వావలంబన సాధించాలన్నారు. మహిళా హక్కుల రక్షణకు రాజ్యాంగంతోపాటు భారత ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీఐ మహేశ్వర్, కళాశాల మహిళా విభాగం కన్వీనర్ ఇందిరా ప్రియదర్శిని, కళావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్ కళాశాల పనితీరుకు కితాబు



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆడిటర్ వినీల

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని విభాగాల పనితీరు సంతృప్తికరంగా ఉందని విద్యాశాఖ ఆడిటర్ అధికారి వినీల తెలిపారు. శుక్రవారం కళాశాలలో మరో ఆడిటర్ మాలతితో కలిసి పరిపాలన సంబంధమైన తనిఖీలు నిర్వహించారు. విద్యా సంబంధమైన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన ఎక్జిట్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులంతా జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. కళాశాల మరింతగా అభివృద్ధి సాధించడానికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్. చంద్రమౌళి, సమన్వయకర్త సుజన, వైస్ ప్రిన్సిపల్స్ కోటేశ్వరయ్య, వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవని పథకాన్ని వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

నగరి: అవని డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరి సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ సందీప్ అన్నారు. శుక్రవారం బ్యాంకులో పీఏసీఎస్ సీఈఓలు, ఖాతాదారులతో ఆయన సమావేశమయ్యారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన అవని డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా డిపాజిట్‌కు 7.8 శాతం ఇస్తారన్నారు. అవని పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా డిపాజిట్లపై 8.30 శాతం ఇస్తామన్నారు. మహిళ సీనియర్ సిటిజన్ అయితే 8.40 శాతం ఇస్తామన్నారు. ఈ డిపాజిట్ కాలపరిమితి 333 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఈ పథకం ఉంటుందన్నారు. రూ.10 వేలకు పైబడి డిపాజిట్లు స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ ఆనంద్, సూపర్‌వైజర్ సాయిప్రదీప్, సీఈఓలు తులసిపిళ్లై, సుబ్రమణ్యం, రాధ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని మెరుగు పరచుకోవాలి



ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నగరి: వ్యవసాయంలో నైపుణ్యాన్ని మెరుగు పరచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జె.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, వీఆర్ఓలు, రైతులతో స్కిల్ ఆఫ్ చిత్తూర్–డిజిటల్ ట్రైనింగ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నైపుణ్యతను పెంచుకోవాలన్నారు. ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డు పొందాలన్నారు. కార్డులను లాగిన్‌లో తనిఖీ చేసి వీఆర్ఓలకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఏ గ్రేడ్ రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సేవలకు బహుమతులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జిలు, రైతు శిక్షకులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగరి, చిత్తూరు ఏడీఏలు సౌభాగ్యలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.